

# ఎవరికెవరు ఈలోకంలో ?

వెన్నజగదీశ్

అప్పుడే తొలి వెలుగులు భూమి మీద వరచుకుంటున్నాయి. మార్చి నెల అయినా ఇంకా చలి పూర్తిగా తగ్గలేదు.

మరీ పల్లెటూరు అయినందువల్లనో, రెండు కిలోమీటర్లు పొగ మంచులో నడచి వచ్చినందువల్లనో నా అరిచేతులు ఐసుముక్కల్లో ఉంచి తీసినట్టుగా పిడచకట్టుకుపోయాయి.

నిన్న నిజామాబాద్‌లో కాన్ఫరెన్స్ ముగిసి, బస్‌స్టాండు చేరుకునేసరికి ఆలస్యమయింది. మా ఊరుకెళ్లే డైరెక్టు బస్సు పది నిముషాల క్రితమే వెళ్లిం దన్నారు. సరే ఇదీ ఒక విధంగా మంచికే జరిగింది. ఎన్నాళ్ల నుంచో రమ్మని ఉత్తరాలు రాస్తున్న మా మామయ్య ఊరెళ్లి, ఉదయం వెళ్లొచ్చులే ననుకుని ఈ ఊరి బస్సెక్కాను. పొద్దు పోయి, అనుకోకుండా ఊడిపడ్డ నన్ను చూసి, మామయ్య ఎంత పరమానందభరితుడయ్యాడో, ఉదయమే వెళ్లాలనేసరికి అంత నీరుగారిపోయాడు. రాత్రి ఒంటిగంటదాకా ఎన్నెన్నో ముచ్చట్లు చెప్పుకుని పడుకున్నాము. నా కెందుకో కొత్త ప్రదేశాలలో అసలు నిద్రపట్టదు. పక్కమీద అటూ ఇటూ దొర్లి ఎంతకీ నిద్ర రాక ఉదయం నాలు గ్గంటలకే లేచి కూర్చున్నాను. ఇంత ఉదయాన్నే నీ కే బస్సూ ఉండదని మామయ్య చెప్పినా, "మార్నింగ్ వాకింగ్ కూడా అవుతుందిలే!" అని చెప్పి బయటపడ్డాను.

బస్సు రావటాని కింకా గంటకు పైగా టైము ఉంది.

ఏదైనా పేపరు దొరుకుతుం దేమో నని బుక్ స్టాల్ వెతుకుతూ ముందుకు నడిచాను. మెయిన్ రోడ్డులో కొంతదూరం వెళ్లేసరికి ఒక చోట పెద్ద గుంపు కనిపించింది.

"ఏ ఊరి వాడో, ఏమో! ఇక్కడి కొచ్చి దిక్కు లేని చావు చచ్చాడు. రాత్రి కాస్త చలి ఎక్కువగా ఉంది కదా! తట్టుకోలేకపోయి ఉంటాడు!"

అక్కడ చేరినవారి మాటల్ని బట్టి ఎవరో రాత్రి చలికి తట్టుకోలేక చనిపోయాడని అర్థం చేసుకున్నాను. వారు చెప్పుకుంటున్న ఆ మనిషి అరుగు మీద నిర్జీవంగా పడి ఉన్నాడు. పాపం! బతికి ఉన్నప్పుడు చలికి కప్పుకోవటానికి

తుండుగుడ్డకు కూడా నోచుకోని వాడికి చచ్చిన తర్వాత మాత్రం ముఖం కనిపించనీయకుండా, ఒంటినిండా వస్త్రం కప్పా రెవరో. ఆ ఊరి సర్పంచ్ కెవరో కబురు పెట్టినట్లున్నారు. ఆయన వస్తూనే ఆరా తీయటం మొదలుపెట్టాడు.

"నెల రోజుల క్రితం టిక్కెట్టు లేకుండా బస్సులో ప్రయాణం చేస్తుంటే కండక్టర్ అతన్ని దింపేశాడని, అలా ఆ ఆగంతకుడు ఊళ్ళోకి ప్రవేశించాడని, మంచి బట్టలతో చదువుకున్న మనిషిలా ఉన్న అతడిని ఏం అడిగినా, తనను కాదేమో నన్నట్లుగా ఎక్కడో చూస్తూ ఏమీ చెప్పలేకపోయేవాడని - " చెప్పారు కొంతమంది.

"ఒకసారి నేను హొటలు తెరవబోతుంటే ఈ మనిషి అరుగు మీద పడుకుని ఉన్నాడు. లేపి, ఏ దడిగినా జవాబు చెప్పకపోతే అతడి అవతారం చూసి, జీవితంలో ఏదో ఎదురు దెబ్బ తిని ఉంటాడని జాలిపడి, తినటాని కింత పెట్టాను. ఆ రోజు నాకు బాగా కలిసి రావడంతో అతని పట్ల మంచి భావం కలిగి అత డిటువైపు వచ్చినపుడల్లా సంతోషంగా తిండి పెట్టేవాడిని" అని చెప్పాడు హొటలువాడు.

"మా ఇంటి ముందు పడి ఉంటే, చలిగా ఉంది కదా అని మా పాలేరుచేత పెరట్లోకి పిలిపించి, పడుకోవటానికి మంచం ఇచ్చాను. ఉదయం, స్నానం చేస్తావా? అని అడిగితే, చేస్తా నన్నట్లుగా తల ఊపాడు. వేణ్ణీళ్లు పెట్టిస్తే తనే స్నానం చేసి, ఆ పూట మా ఇంట్లోనే తిని వెళ్లాడు. యాదృచ్ఛికంగా అదే రోజు మా అబ్బాయికి ఉద్యోగానికి పిలుపు వస్తే మేమూ అతడి రాకను అదృష్టంగా భావించాము" అని చెప్పాడు మరో ఆసామి.

నేను కొత్త బట్ట లిచ్చానని దర్జీవాడు చెబితే, నేను రోజూ చాయ్ పోసేవాడి నని టీకొట్టు వా డన్నాడు. మా తోట కొచ్చినప్పుడల్లా నేను జామ పండ్లు ఇచ్చా నని తోటమాలి చెప్పుకున్నాడు.

ఇలా అందరూ ఆ చచ్చిన వాడి కేమేం చేసిందీ వివరించేసరికి ఆ అదృష్ట జాతకుడి ముఖం చూడా లన్న ఆసక్తితో ముఖమ్మీద నుండి గుడ్డ తొలగించాడు సర్పంచ్.

నే నొకసారి చచ్చినవాడి మొఖం చూసి అవాక్కయిపోయాను. నా కళ్లకి, మెదడుకి కొద్ది నిముషాల వరకు లింక్ తెగిపోయినట్లయింది. నేను చూస్తున్న దేమిటో స్ఫురణ కొచ్చేసరికి అప్రయత్నంగా నా పెదవులు, "శ్రీనివాస్ గారు!" అని ఉచ్చరించాయి.

** ** **

మాది పేద కుటుంబం. మా నాన్న సంపాదన తక్కువ అని కాదు గాని, ఆయన సంపాదన మీద ఆధారపడినవారి సంఖ్య మాత్రం ఖచ్చితంగా ఎక్కువే. అతి కష్టమ్మీద నన్ను మా ఊళ్లో ఉన్న కాలేజీ చదువు చెప్పించగలిగారు మా నాన్నగారు. ఇక చదువు మానేసి ఏదైనా పని చూసుకుని తనకు చేదోడు వాదోడుగా ఉండమని కోరారు. కాని నాకు ఇష్టం లేకపోయింది. ఎలాగైనా ఇంజనీరు చదవాలని నా ఆకాంక్ష. ఈ విషయంలో మా మధ్య వాగ్యుద్ధం జరిగింది. పట్నం వెళ్ళి పై చదువులు చదువుతా నని ఖచ్చితంగా చెప్పాను నేను. చిల్లి గవ్వ కూడా నీకు సహాయం చేయనని తన నిర్ణయం అంత ఖచ్చితంగానూ చెప్పారు నాన్నగారు.

ధైర్యంగా పట్నమొచ్చి, కాలేజీలో జాయినయ్యాను కాని చదువు కొనసాగించటం చాలా దుర్భరమయింది నాకు. అప్పటికీ నా పరిస్థితి తెలుసుకున్న నా స్నేహితులు అద్దె ఇవ్వకుండానే నన్ను వారి గదిలో ఉండనిచ్చారు. మొదట్లో కాదన్నా మళ్లీ మనసు మార్చుకున్న నాన్న కూడా నెలనెలా మూడొందలు పంపించసాగారు. కాని ఇంజనీరు చదువుకు కావలసిన ఖర్చులో ఆ డబ్బు సముద్రంలో కాకిరెట్ట అయింది. ఫలితంగా నేను రోజూ ట్యుటోరియల్‌లో క్లాసులు చెప్పటానికి నిర్ణయించుకున్నాను. ఉదయం కాలేజీ, సాయంత్రం ట్యుటోరియల్ పోగా నాకు మిగిలే సమయం చాలా తక్కువ. ఇక వంటా వార్పూ పెట్టుకుంటే చదువు సాగదని మా స్నేహితులతో పాటు నేను కూడా మెస్సులోనే భోంచేసేవాడిని.

ఆ మెస్సు ఓనరే శ్రీనివాస్‌గారు. చాలా మంచివారు. పట్నంలో మిగతా మెస్సుల రేట్ల కన్నా ఆయన మెస్సులో రేట్లు చాలా తక్కువ. మా కెప్పుడైనా డబ్బుకు ఇబ్బందిగా ఉంటే ఒత్తిడి తెచ్చేవారు కాదు. పరవాలేదు, నిదానంగా ఇవ్వండనేవారు. భోజనం కూడా అమ్మ చేతిని మరపించేదిగా ఉండేది. ప్రతి బుధవారం స్వీటు, ప్రతి ఆదివారం స్పెషల్ - అంటే చికెన్, మటన్, ఫిష్ష్ చేయించి పెట్టేవారు. మా స్నేహితుల్లో నే నొక్కడినే శాకాహారిని. నేను మాంసం ముట్టనంటే "కనీసం ఆమ్లెటయినా తినండి. కోడిగుడ్డు శాకాహారమే కదా!" అని బలవంతం పెట్టేవారు. ఆయన మెస్సులోనే నేను కోడిగుడ్డు తినడం అలవాటు చేసుకున్నాను. ఇవిగాక, అన్ని పండుగలకూ పిండివంటలు ఫ్రీగా పెట్టేవారు.

ఒకరోజు ట్యుటోరియల్‌లో చాలా ఆలస్యమయింది. రాత్రి పది దాటినందువల్ల హొటళ్లు కూడా మూసివేశారు. ఆ రోజెందుకో ఆకలి కూడా ఎక్కువగానే ఉంది నాకు. ఈపాటికి మెస్సు మూసేసి ఉంటారని తెలిసినా వెళ్లాను. నే ననుకున్నట్లే లైట్లన్నీ ఆర్పేసి తలుపులు మూసి ఉంది. ఒక్క నిముషం సందేహించి బెల్లు నొక్కాను. తలుపులు తెరిచి ఆవులిస్తూ బయటికొచ్చిన శ్రీనివాసరావుతో విషయం చెప్పాను బిడియపడుతూ.

లోపలికి పిలిచి, అన్నం, సాంబారుతోపాటు తాము ఇంట్లో వాడుకునే నెయ్యి కూడా వడ్డించారు. నేను సుష్టుగా తిని, డబ్బులివ్వబోతుంటే ససేమిరా తీసుకోనంటారు. "మీ రేం తిన్నారనీ! కూర లేదు, పప్పు లేదు, పెరుగు లేదు. ఏమీ పెట్టకుండానే మీ నుండి డబ్బు లెలా తీసుకుంటా ననుకుంటున్నారు!" అన్నారు.

"సార్! నిజం చెప్పాలంటే రోజూకన్నా ఈ పూట సుష్టుగా తిన్నాను!" అని ఎంత చెప్పినా వినిపించుకోలేదు.

"మీకు కడుపునిండా పెట్టినప్పుడే నాకు మీ దగ్గర డబ్బు తీసుకునే హక్కు ఉంటుంది. సగం కడుపుతో మీ రిచ్చిన డబ్బు నాకు వంటబట్టదు" అని పైసా కూడా నా దగ్గర తీసుకోలేదు.

నాకు ఫైనలియర్ పరీక్షలు దగ్గర పడటంతో చదువుకోటానికి సమయం చాలదని ట్యుటోరియల్ మానేయాలనుకున్నాను. ఈ విషయం శ్రీనివాసరావుతో చెబితే, "మంచి పని చేశారు. డబ్బేమైనా కావాలా? మొహమాట పడకుండా చెప్పండి!" అనడిగారు.

"నాకు డబ్బు అవసరం లేదు గాని, ఈ మూడు నెలలు నేను మెస్సు డబ్బు చెల్లించలేను. పరీక్షలయిన తర్వాత మా ఊరెళ్లి డబ్బు తెచ్చిస్తాను" అని అడగలేక అడగలేక అడిగాను.

"డబ్బు దేముందిలెండి, మీకు వీలైనప్పుడే ఇవ్వండి! మీరు మాత్రం ఇప్పటినుండే చదువులో

### ఫోటోగ్రఫీ

ఫోటోగ్రఫీ అన్న పదం గ్రీక్ భాష నుండి వచ్చింది. గ్రీక్ భాషలో 'ఫోస్' అంటే కాంతి అని, 'గ్రాఫోస్' అంటే రాయడం. ఫోటోగ్రఫీకి తెలుగులో ఛాయాచిత్రం అని అర్థం. ఫ్రెంచి శాస్త్రవేత్త జోసెఫ్ సైనిఫర్ **1926**లో ఫోటో తీసే పరికరాన్ని తయారు చేసి, మొట్టమొదటిగా ఫోటో తీశాడు. **1850** నుండి ఫోటోగ్రఫీ ఒక కళగా, హాబీగా అభివృద్ధి చెందింది.

సేకరణ: పి.ఎ.ప్రభాకర్‌దత్తు
(విశాఖపట్నం)



పడి తిండీ తిప్పలూ మానేసేరు సుమా! మొదటికే మోసం వస్తుంది!" అని భుజం తడితే, ఆయన మంచితనాన్ని అంచనా వేయలేకపోయాను.

అనుకున్నదానికంటే పరీక్షలు బాగా రాశాను. మా ఊరికి తిరిగొచ్చేస్తూ, చెప్పి వెళ్దామని మెస్సుకెళ్తే శ్రీనివాసరావుగారు కనిపించలేదు. చేసేది లేక త్వరలో వచ్చి నా బాకీ చెల్లు చేస్తా నని పనివాడితో చెప్పి వచ్చేశాను.

** ** **

అప్పు అయిదొందలు సమకూర్చుకోటానికి నాకు మూడు నెలలు పట్టింది. అప్పు తీర్చేసి, అలాగే ర్యాంకు సంగతి చెప్పి నోరు తీపి చేద్దామని స్వీటుతో వెళ్లిన నాకు కొన్ని భయంకరమైన నిజాలు తెలిశాయి - మా స్నేహితుల ద్వారా.

నేను వెళ్లిన వారం రోజులకే ఒక రోజు వంట చేస్తూండగా ప్రమాదం జరిగి శ్రీనివాసరావు ఎదుటే ఆయన భార్య మంటలకు ఆహుతి అయిందని, ఆ షాక్ తట్టుకోలేని శ్రీనివాసరావుగారు ఎంత ప్రయత్నించినా తిరిగి మామూలు మనిషి కాలేకపోయారని చెప్పారు. అప్పుడొచ్చిన వారి తమ్ముడి ద్వారా శ్రీనివాసరావు గతం కూడా తెలిసింది.

శ్రీనివాసరావు మొదట్లో స్వంత ఊరిలో ప్రభుత్వోద్యోగం చేస్తూండేవారు.

ఆ ఊళ్లోనే ఒక అమ్మాయిని ప్రేమించి మతాంతర వివాహం చేసుకున్నారు. వారి పెళ్లి ఉభయపక్షాల వారికి కన్నెర్ర చేయించింది. శ్రీనివాసరావు తండ్రి, బంధువు లందరినీ పిలిపించి తన కుమారుడు చనిపోయాడని తీర్మానించి పెద్ద కర్మ పెట్టేస్తే, మత ఛాందసులైన ఆ అమ్మాయి తరపువాళ్లు ఏకంగా శ్రీనివాసరావును కాటికి పంపే ఏర్పాట్లు చేశారు.

ఈ విషయం ముందుగానే తెలుసుకోగలిగిన శ్రీనివాసరావు భార్యతో అర్ధరాత్రి ఊరు వదిలి పారిపోవటానికి ప్రయత్నిస్తే కొందరు దుండగులు మారణాయుధాలతో వెంటబడ్డారు. చివరికి రైల్వే స్టేషను ఎదుట వారి చేతికి చిక్కిన శ్రీనివాసరావును కత్తితో పొడవబోతుంటే, ఆయన భార్య అడ్డురావడంతో కత్తి ఆమె కడుపులో దిగిపోయింది. అదే సమయంలో స్టేషనులోకి రైలు రావడంతో అదే బండిలో ఆమెను పట్నం తీసుకొచ్చి ప్రాణాలు పోకముందే హాస్పిటల్లో చేర్చగలిగారు. చివరికి ఆమె ప్రాణాలైతే దక్కాయిగాని గర్భసంచి మాత్రం తీసివేయక తప్పలేదు. ఈ విషయం భార్యకు తెలియనీయకుండా ఎంతోకాలం దాచలేకపోయారు శ్రీనివాసరావు.

ఆమెకు నిజం తెలిసిన రోజున గుండె పగిలేలా ఏడుస్తూంటే, "చూశావుగా! మన కిష్టమైన పెళ్లి మనం చేసుకుంటే ఈ రోజున ఏ క్షణంలో మన పక్కన మృత్యువు తారాట్లాడుతోందో నని కలవర పడాల్సిన పరిస్థితి తెచ్చారు. ఇలాంటి స్థితిలో మనకు పిల్లలు పుడితే, వారిని మనం సంరక్షించుకోగలమంటావా?" అని భార్యను ఓదార్చి, తనూ గుండె రాయి చేసుకున్నారు.

నలుగురి కళ్లలో పడితే, ప్రాణాల కెక్కడ ముప్పు వాటిల్లుతుందో నసే భయంతో మారు మూల మెస్సు తెరిచి, వీలైనంతవరకు నాలుగ్గోడల మధ్యనే ఉండడానికి ప్రయత్నించేవారు. పిల్లలు లేని శ్రీనివాసరావుగారు మెస్సు కొచ్చే వారినందరినీ తమ పిల్లలుగా ప్రేమ చూపేవారు.

భార్య చావు కబురు పనివానితో చెప్పి పంపినా ఆమె కన్నవా రెవరూ అంత్యక్రియలకు రామన్నారట! పైగా ఎప్పుడో పదేళ్ల క్రితమే మా అమ్మాయి చనిపోయింది. మళ్లీ ఇప్పుడు కొత్తగా చావట మేమిటని ఎదురు ప్రశ్న వేశారట!

చివరికి మా స్నేహితులే ముందుకొచ్చి ఆ మహాతల్లి అంత్యక్రియలు జరిపి, వారే తల కొరివి పెట్టారట. శ్రీనివాసరావును ఒంటరిగా వదలబుద్ధిగాక, ఆయనను కనిపెట్టి ఉండటానికై ఆ రాత్రి మా స్నేహితులంత ఆయనింట్లోనే పడుకున్నారట. మరునటిరోజు ఉదయం శ్రీనివాసరావు తమ్ముడొచ్చారు. వారం రోజులుండి మెస్సు నమ్మేసి కావలసిన బకాయిలు వసూలు చేసుకుని శ్రీనివాసరావును వెంట తీసుకెళ్లిపోయారు.

నెల తిరక్కుండానే మళ్లీ వచ్చి మూడు రోజుల నుండి శ్రీనివాసరావు ఊళ్లో కనిపించటంలేదని, ఇక్కడికేమైనా వచ్చా డేమో నని వాకబు చేయటానికొచ్చా నన్నాడట! అక్కడి.. కెళ్లినా శ్రీనివాసరావులో మార్పేమీ లేదట. ఆ తర్వాత ఏం జరిగిందో ఎవరికీ తెలియదు.

** ** **

ఇన్నాళ్లకు ఈ ఊళ్లో ఇలా శవమై కనిపించటం నన్ను తీవ్రంగా కలచివేసింది. చాలా రోజుల తర్వాత నా కళ్లు తడి అయ్యాయి.

"ఇప్పు డేం చేద్దామంటారు? అనాథ శవమని చెప్పి టౌనులో పోలీసులకు కబురంపనా? లేక, మనమే పదో పరకో వేసుకుని దహనం చేద్దామంటారా!" సర్పంచ్ అడుగుతున్నా రందరినీ.

అతను అనాథ కాదనీ, ఆయన కో తమ్ముడున్నాడనీ చెప్పాలనిపించలేదు నా కా క్షణంలో.

"అత డెక్కడివాడైనా నెలరోజులుగా మన ఊళ్లో మన మధ్య తిరుగుతూ మన ఇళ్లలో తిన్నవాడు. మన చేతులమీదుగానే సాగనంపితే బాగుంటుంది!" అన్నా రెవరో.

"అయితే సరే, మీ ఇష్టం!"

సర్పంచ్ చందాలకై ముందుకు కదిలేసరికి పరుగున వెళ్లి వారించాను.

"సార్! మీ రెవరూ చందా లివ్వనవసరం లేదు. ఆయన అంత్యక్రియల ఖర్చు నే నిచ్చుకుంటాను" అని జేబులో ఉన్న పన్నెండు వందలు తీసి సర్పంచ్ చేతిలో పెట్టాను. మరో ప్రశ్నకు అవకాశ మివ్వకుండా, బస్సుకు టైమయిందని చెప్పి గిరుక్కున వెనుదిరిగాను.

"శ్రీనివాసరావుగారూ!

"బతికుండగా మీ అప్పు తీర్చే అవకాశం నా కివ్వనేలేదు. ఇప్పు డీ డబ్బిచ్చి మీ అప్పు తీర్చుకోగలిగా నేమో కాని, మీ ఋణం మాత్రం నే నేనాటికీ తీర్చుకోలేను. కడుపునిండా అన్నం పెట్టిన మీకు, పిడికెడు మట్టిని కూడా పంచలేను. సమయానుకూలత లేక మీ అంత్యక్రియలలో పాల్గొనకుండా వెళ్లిపోతున్నందుకు మన్నించగలరు!" - మనసులో క్షమాపణలు చెప్పుకుని వేగంగా అడుగులేశాను.

ఎన్నో జతల కళ్లు నా వంక ఆశ్చర్యంగా చూస్తూండగా బస్‌స్టాండ్‌లోకి నడిచాను నేను.

★

## మాట్లాడే కెమేరా !

ఫోటోలు తీయించుకోవడం అందరికీ సరదాయే. రకరకాల పోజులో ఫోటోలు తీయించుకుంటారు. అయితే కొందరికి నలుగురు ముందు మన కిష్టం వచ్చినట్లుగా ఫోటోలు తీయించుకోవడం సిగ్గు. అందుకే ఎవరూ లేకుండా ఫోటోలు తీయించుకోడానికి మాట్లాడే కెమేరాని కొత్తగా తయారు చేశారు జపాన్ వాళ్లు. లైటింగ్ చాలకపోతే ఫ్లాష్ కావాలని, దూరం సరిపోక పోతే దూరం జరగమని, దగ్గరకు రమ్మని చెబుతుంది ఆ కెమేరా. ఇలాంటి కెమేరాలు మన దేశంలోకి ఇంకా రాలేదు.

సేకరణ: పి.ఎ.ప్రభాకర్ దత్తు (విశాఖపట్నం)

